క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం, శాసనసభ ప్రతిపక్ష నాయకుడు ఆర్.అశోక, ఎంపీ ముత్తుస్వామి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద వీరికి అధికారులు స్వాగతం పలికారు. వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో వీరి పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాలను వీరికి ఆలయ ఏఈవో పాలూరి నరసింగరావు, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు అందజేశారు.

మందకొడిగా ప్రసాద్ స్కీమ్ పనులు

ఎమ్మెల్యే గంటా అసహనం

సింహాచలం: సింహాచలం దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.54 కోట్లతో జరుగుతున్న ప్రసాద్ స్కీమ్ పనులు వేగవంతంగా జరగడం లేదని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అసహనం వ్యక్తం చేశారు. అప్పన్న స్వామిని శనివారం దర్శనం చేసుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. సింహాచలం దేవస్థానం మాస్టర్ ప్లాన్‌కి, కొత్తగా చేర్చిన ప్రసాద్ స్కీమ్ పనులకు మధ్య అంతరం ఉందని.. దీనిపై త్వరలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. విజయసాయి రెడ్డికి ప్రతీదీ రాజకీయం చేయడం అలవాటని గంటా మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకూడదని తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశానని గుర్తు చేశారు. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు స్టీల్‌ప్లాంట్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రిని విశాఖకి తీసుకొచ్చి ఎట్టి పరిస్థితుల్లో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాదని ప్రకటన చేయించారన్నారు. విశాఖ ఎంపీ భరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌తో సహా విశాఖలోని ఎమ్మెల్యేలంతా స్టీల్‌ప్లాంట్‌ని కాపాడటానికి కృషి చేస్తున్నారన్నారు. భరత్, పల్లా శ్రీనివాస్‌లు రాజీనామా చేయాలని విజయసాయిరెడ్డి డిమాండ్ చేయడం సిగ్గుచేటన్నారు. సింహాచలం దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల భూసమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని గంటా అన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలబోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వేంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు.

అలరించిన చిన్నారుల డ్యాన్స్ పోటీలు



డ్యాన్స్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురి కాలనీలో కాలనీ అసోసియేషన్, కాలనీ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయ చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి చిన్నారులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. పిల్లలు తమ డ్యాన్స్‌లతో స్థానికులను అలరించారు. నిర్వాహకులు నడింపల్లి రామరాజు, యశ్వంత్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వినాయక లడ్డూ వేలం



లడ్డూ వేలంలో పాల్గొన్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

పెందుర్తి: పురుషోత్తపురంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇక్కడ కొలువుదీరిన సంపత్ వినాయక స్వామి సన్నిధిలో శనివారం లడ్డూ వేలం వేశారు. కాలనీకి చెందిన చిన్ని రామకృష్ణ రూ.10,216కు లడ్డూను సొంతం చేసుకున్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చందుయాదవ్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గణనాథుడి సన్నిధిలో అన్నసమారాధనలు



96వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న శరగడం చిన అప్పలనాయుడు



చినముషిడివాడలో గణపతిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ వసంత, శంకరరావు దంపతులు



పరవాడలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు, అప్పలనాయుడు



అజనగిరిలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెందుర్తి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం అన్నసమారాధనలు నిర్వహించారు. జీవీఎంసీ 96వ వార్డులోని రాచ్చెరువు, దొగ్గవానిపాలెం, పెందుర్తి పాతూరు, పెందుర్తి కూడలి, సాయినగర్, ద్రోణంరాజునగర్, దుర్గానగర్ ప్రాంతాల్లోని గణపతి మండపాలను వైఎస్సార్‌సీపీ నేత, మాజీ కార్పొరేటర్ శరగడం చిన అప్పలనాయుడు సందర్శించి అన్నసమారాధనలు ప్రారంభించారు. ముందుగా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. అవగడ్డ అప్పలనాయుడు, మల్లేష్, నాగ అప్పారావు, శ్రీను, హరి తదితరులు పాల్గొన్నారు.

• 97వ వార్డు చినముషిడివాడ, శ్రమశక్తినగర్, వాణిపాలెం, ఎస్సీ బీసీ కాలనీ, సుజాతనగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణపతి మండపాలను కార్పొరేటర్ శానాపతి వసంత, శంకరరావు దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అన్నసంతర్పణలు నిర్వహించారు.

గ్రామాల్లో సందడి

పరవాడ: పరవాడలోని సిరపరపు, చుక్క వారి వీధిలో క్రేజీ బాయ్స్, బ్యాడ్ బాయ్స్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం వినాయక మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు ప్రారంభించారు. స్థానికులు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు, నాయకులు సిరపరపు రాజేష్, బండారు రాజు, ఎస్.అప్పలనాయుడు, కర్రి సంతోష్, ఎస్.అక్కునాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• ముత్యాలమ్మపాలెం శివారు దిబ్బపాలెంలో కొలువైన సిద్ధి వినాయకుడిని గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో సందడి వాతావరణం నెలకొంది.

అజనగిరిలో ఎమ్మెల్యే పూజలు

సబ్బవరం: జీవీఎంసీ 88వ వార్డు అజనగిరిలో వరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయ మండపం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, సీనియర్ నాయకులు ఇందల రమణ, బలిరెడ్డి అప్పారావు, కంచిపాటి రాంబాబు, గళ్ల శ్రీనివాస్, కల్లెపల్లి ఎర్నిబాబు, బోడ్డుపల్లి సూరిదేముడు తదితరులు పాల్గొన్నారు.

'అల్లూరి'లో బాధిత కుటుంబాలకు సాయం



బాధితులకు నిత్యావసర సరకులు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పరవాడ జెడ్పీటీసీ రాజు

పరవాడ: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నిరాశ్రయులైన బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, జెడ్పీటీసీల బృందం శనివారం చట్రాయపల్లి గ్రామాన్ని సందర్శించింది. బాధిత పునరావాస కేంద్రం సప్పర్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆశ్రయం పొందుతున్న వారిని పరామర్శించారు. వారికి తమ వంతు సాయంగా బియ్యం, కూరగాయలు, చీరలు, దుప్పట్లను పంపిణీ చేశామని పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు తెలిపారు.

గురుకుల పాఠశాలలో హిందీ దినోత్సవం



మట్టిబొమ్మలు, ఆదివాసీల పంటలను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం హిందీ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ రాజభాష హిందీ గొప్పతనం, దాని ఔన్నత్యాన్ని కొనియాడారు. హిందీ టీచర్లు సాయి రామకృష్ణ, సునీత విద్యార్థులతో ఆదివాసీల జీవన స్థితిగతులు, పంటలు, వివిధ రకాల కూరగాయలు, పండ్లను హిందీలో వివరిస్తూ ప్రదర్శించారు. వివిధ రకాల బొమ్మలను ఆకర్షణీయంగా విద్యార్థులతో తయారు చేయించారు. హిందీ వ్యాకరణాన్ని చార్ట్స్ రూపంలో చూపించారు. హిందీ వ్యాసరచన, డిబేట్, ఆర్ట్స్ పోటీలను నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ సత్యారావు, రాంబాబు, ప్రసాద్, తిరుపతిరావు, ప్రభాకరరావు, కేశవ, ఐస్సాక్, లక్ష్మణరావు, సూర్యలు విద్యార్థులను అభినందించారు.

అప్పన్న వేద పాఠశాలలో లక్ష గరిక పూజ



లక్ష గరిక పూజ నిర్వహిస్తున్న వేద విద్యార్థులు



లక్ష్మీగణపతి హోమం చేస్తున్న వేద విద్యార్థులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానానికి చెందిన వేద పాఠశాలలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామికి వేద విద్యార్థులు లక్ష గరిక పూజ ఘనంగా నిర్వహించారు. లక్ష్మీగణపతి హోమాన్ని విశేషంగా జరిపారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను చేపట్టి హారతులు సమర్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంతాచార్యులు, వేద పండితుడు కాళ్లకూరి సుబ్రహ్మణ్యేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. పాఠశాల సూపరింటెండెంట్ విక్రమ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దస్తావేజు లేఖర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే రమేష్‌బాబుతో మాట్లాడుతున్న సంఘ ప్రతినిధి చిన్నారావు

పెందుర్తి: రాష్ట్రంలో దస్తావేజు లేఖర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బలగా చిన్నారావు, సహాయ కార్యదర్శి పెంటకోట శ్రీనివాసరావు కోరారు. శనివారం ఎమ్మెల్యేను కలిసిన సంఘ ప్రతినిధులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. తమ లైసెన్స్‌ల రెన్యూవల్, ప్రైమ్ 2.0 సాంకేతిక సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూడాలని విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

గాడిచర్ల జీవితం నేటితరానికి ఆదర్శం



అడవివరం గ్రంథాలయంలో గాడిచర్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నరసింహం తదితరులు

సింహాచలం: గ్రంథాలయోద్యమ నాయకుడు, తొలి తెలుగు పత్రికా సంపాదకుడు, విద్యావేత్త గాడిచర్ల హరిసర్వోత్తమ రావు జయంతిని శనివారం అడవివరం గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం ఆధ్వర్యంలో సర్వోత్తమరావు చిత్రపటానికి సామాజిక కార్యకర్త కోడుగంటి వెంకట నరసింహం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను పాఠకులకు చేరువ చేయడంలో గాడిచర్ల విశేష కృషి చేశారన్నారు. పత్రికల ఆవశ్యతను తెలిపేందుకు, వయోజన విద్య వ్యాప్తికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆంధ్రులలో తొలి రాజకీయ ఖైదీగా మహాత్మా గాంధీ చేత కీర్తింపబడిన గాడిచర్ల జీవితం నేటితరానికి ఎంతో ఆదర్శమని చెప్పారు. ఉద్యమాలంటే ఎంతో ఇష్టపడే నేతని, ప్రజలను విజ్ఞాన వంతులుగా తీర్చిదిద్దేందుకు వయోజన విద్య ప్రాముఖ్యాన్ని తెలియజేశారని కొనియాడారు. గాడిచర్ల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బండారు గంగునాయుడు, పాఠకులు హరీష్, కవిత, అను, వర, భానుమూర్తి, మహేంద్ర పాల్గొన్నారు.

దివ్యంగా దీపారాధన



దీపారాధనలో మహిళలు, చిన్నారులు

సింహాచలం: అడవివరంలోని పోస్టాఫీసు వీధిలో సింహాద్రి యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి దీపారాధనను విశేషంగా నిర్వహించారు. శివలింగం ముగ్గును వేసి దీపాలను వెలిగించారు. పెద్ద ఎత్తున మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించి నిత్యం ప్రజా సమస్యలపై పోరాడిన సీతారం ఏచూరి మృతి కార్మిక వర్గానికి తీరని లోటని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. సీఐటీయూ పరవాడ జోన్ ఆధ్వర్యంలో శనివారం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడేందుకు అలుపెరగని పోరాటాలు చేసిన మహాయోధుడని ఏచూరి సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామలక్ష్మి, బి.లక్ష్మి, అరుణ, పార్వతి పాల్గొన్నారు.

ప్రాథమిక చికిత్సపై విద్యార్థులకు అవగాహన



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, సిబ్బంది

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు ప్రాథమిక చికిత్సపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డిస్ట్రిక్ట్ సెక్రటరీ, రీసోర్స్ పర్సన్ ట్రైనర్ ఎండీ రహమతుల్లా మాట్లాడుతూ హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలన్న దానిపై వివరించారు. అత్యవసర సమయంలో ప్రాథమక చికిత్స చేసే విధానాన్ని తెలియజేశారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించారు. కళాశాల కార్యదర్శి టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఎన్ఈ ఫ్లోరా, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

పెందుర్తి: గీతం మెడికల్ కళాశాల/ఆస్పత్రి ఆధ్వర్యంలో పెందుర్తి మండలం సరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ మెడిషన్, కీళ్ల నొప్పులు(ఆర్థోపెడిక్), చర్మ రోగ విభాగం(డెర్మటాలజీ), చెవి, ముక్కు, నాలుక(ఈఎన్‌టీ), కంటి వైద్యం(ఆప్తామాలజీ), పిల్లల వైద్యం(పిడియాట్రిక్), మహిళల వైద్యం(గైనకాలజీ), దంత వైద్యం(డెంటల్) విభాగాల్లో ఉచితంగా పరీక్షలు చేసి, మందులు అందిస్తామన్నారు. అవసరమైన వారికి గీతం మెడికల్ కళాశాలలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్న ఈ శిబిరాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని సూచించారు.